# శ్రీ పొట్టి శ్రీరాములు గారి జయంతి సందర్భంగా

## ఆ మహనీయునికి నివాళి అర్పిస్తూ

## ఆంధ్రప్రదేశ్ శాసనసభ తీర్మానం

ఈరోజు తెలుగు ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేసిన మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములు గారి జయంతి. తెలుగువారి ఐక్యత కోసం, తెలుగువారికి స్వయం పాలన అందించడం కోసం అశువులు బాసిన ఆ అమరజీవికి ఈ శాసనసభ శ్రద్ధాంజలి ఘటిస్తోంది. ఆ త్యాగమూర్తి జన్మదినాన తెలుగుజాతి కోసం ఆయన చేసిన ప్రాణత్యాగాన్ని, చిరస్మరణీయ సేవలను ఒకసారి మననం చేసుకోవడం నవ్యాంధ్రప్రదేశ్ పునర్ నిర్మాణంలో మనందరిలో మళ్లీ ఒక స్ఫూర్తినింపగలదని ఈ శాసనసభ భావిస్తోంది.

శ్రీ పొట్టి శ్రీరాములు గారు మార్చి 16, 1901 వ సంవత్సరంలో మద్రాసు నగరం జార్జి టౌన్ అన్నాపిల్లై వీధిలో శ్రీ గురవయ్య, మహాలక్ష్మమ్మ పుణ్యదంపతులకు జన్మించారు. బొంబయిలో శానిటరీ ఇంజనీరింగులో పట్టభద్రులయ్యారు. 25 ఏళ్ల వయసులోనే రైల్వే ఉద్యోగాన్ని వదిలి గాంధీ మహాత్ముని అనుచరుడిగా సబర్మతి ఆశ్రమంలో చేరి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్షను అనుభవించారు. 1941–42లో సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని మరో మూడుసార్లు జైలుశిక్షను అనుభవించారు.

ప్రేమ, వినయం, సేవ, నిస్వార్థత మూర్తీభవించిన స్వరూపం శ్రీ పొట్టి శ్రీరాములు గారు. సత్యాన్ని, అహింసను ఆరాధించే ప్రేమమూర్తి. పేద ప్రజల ఉన్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి. 1946లో నెల్లూరు మూలపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో హరిజనుడి ప్రవేశం కోసం నిరాహారదీక్ష బూని విజయం సాధించారు. గాంధీజీకి శ్రీరాములు గారంటే ప్రత్యేక అభిమానం. పొట్టి శ్రీరాములు వంటి కార్యదీక్షాపరులు పదిమంది ఉంటే ఒక్క సంవత్సరంలోనే స్వాతంత్ర్యం సాధించగలమని అంటూ ఉండేవారు.

తెలుగువారు అవమానాలకు, అవహేళనకు, అన్యాయానికి గురవుతున్న నేపథ్యంలో పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోరుతూ 1952 అక్టోబర్ 19న మద్రాసులోని

బులుసు సాంబమూర్తిగారి ఇంట్లో నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. ఆయన నిరశన దీక్షకు మద్దతుగా ఆంధ్రదేశమంతటా ఆనాడు సమ్మెలు, ప్రదర్శనలు జరిగాయి. పొట్టి శ్రీరాములుగారికి సంఘీభావంగా, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రజలు స్వచ్ఛందంగా ఉద్యమంలో పాల్గొన్నారు. 1952 డిసెంబర్ 15 అర్ధరాత్రి శ్రీరాములు గారు తన ఆశయ సాధన కోసం ప్రాణాలు అర్పించారు. ఆయన దీక్ష ఫలితంగా 1952 డిసెంబర్ 19న అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. 1953 అక్టోబర్ 1 వ తేదీన కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు గారు ప్రథమ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఐతే, తెలుగుభాష మాట్లాడే వారందరికీ ఒక రాష్ట్రం ఉండాలని, తెలుగు మాట్లాడే నైజాం రాష్ట్రాన్ని ఆంధ్రలో విలీనం చేసి ప్రత్యేక రాష్ట్రం ఆకాంక్ష మొగ్గతొడిగి క్రమంగా బలపడింది. అనేక ఉద్యమాలు, పెద్దమనుషుల ఒప్పందం ఫలితంగా 1956 నవంబర్ ఒకటో తేదీన హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటయ్యింది. దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికన ఆవిర్భవించిన తొలిరాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు ఘనకీర్తి లభించింది.

తన ప్రాణాలను తృణప్రాయంగా త్యజించి తెలుగువారిలో ఐక్యత తెచ్చిన మహనీయుడు పొట్టి శ్రీరాములుగారు. ఆచంద్ర తారార్కం తెలుగువారి ఐక్యతే ఆయనకు నిజమైన నివాళిగా భావిస్తూ, ఆంధ్ర రాష్ట్రం కోసం ఆత్మార్పణ చేసిన ఆ అమరజీవికి ఈ శాసనసభ ఘనమైన నివాళి అర్పిస్తోంది.